

తాళ్లపూడిలో భారీ వర్షం...

ప్రజాశక్తి - తాళ్లపూడి

వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా శనివారం తాళ్లపూడి మండలంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులు కూడిన వర్షంతో పాటూ ఈదురు గాలులు వీచాయి. మండలంలో 57 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. వర్షం కారణంగా తాళ్లపూడి మెయిన్ బజార్, పలు గ్రామాల్లోని పాఠశాలల ఆవరణలోకి వర్షం నీరు చేరింది. ప్రక్కిలంకలోని ఆటోనగర్ వద్ద వర్షం నీరు నిల్వ ఉండటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వర్షపు నీటితో నిండిపోయిన పాఠశాల ఆవరణ

కరోనా కలకలం

- సత్యవాడలో వెలుగు చూసిన కేసు
- కాకినాడ జిజిహెచ్‌కు బాధితుల తరలింపు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- గ్రామంలో పారిశుధ్య పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - రామచంద్రపురం

2019 నుంచి 2022 వరకు ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ మళ్లీ ఇప్పుడు తన ఉనికిని చాటుకుంటూ విజృంభిస్తుంది. సింగపూర్, మలేషియా, చైనా వంటి దేశాల్లో వెలుగు చూసిన కరోనా వేరియంట్ ఇప్పుడు జిల్లాలోనూ ప్రవేశించింది. కె.గంగవరం మండలం సత్యవాడ గ్రామానికి చెందిన ఒక వృద్ధునికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణైంది. అనారోగ్యానికి ఆయన్ని కుటుంబ సభ్యులు ద్రాక్షారామంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి శుక్రవారం రాత్రి తరలించారు. దగ్గు, జలుబు, జ్వరం ఒంటి లక్షణాలు ఉండడంతో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎం.రాంబాబు అతనికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ర్యాపిడ్ టెస్ట్‌లో కరోనా పాజిటివ్ రావడంతో వెంటనే అతన్ని, అతనితో వచ్చిన భార్యను కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితునికి ఆర్‌టిపిసిఆర్ పరీక్ష నిర్వహించారు. కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ చేశారు. దీంతో కుటుంబ సభ్యులను కూడా హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఐసోలేషన్ వార్డులో వారికి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అందరి పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. మిగిలిన వారికీ ఆర్‌టిపిసిఆర్ టెస్టులు చేస్తామని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు ఇన్ఫ్లుఎంజా వంటి లక్షణాల్లో కరోనా వైరస్ కనిపించవచ్చు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. ద్రాక్షారామం నుంచి కాకినాడ వెళ్లిన వ్యక్తికి కరోనా నిర్ధారణ కావలసి ఉంది. ముందు జాగ్రత్తగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మాస్కులు ధరించడం, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, శానిటైజర్ శుభ్రపరచుకోవడం, వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. సభలు, సమావేశాలు ఉన్న ప్రాంతాల్లో సంచరించడం వంటివి మానుకోవాలి. అదేవిధంగా వైరస్ చోకిన వ్యక్తులకు సాధారణ వైద్యం అందించే ఏర్పాట్లు ఉన్నాయి. కరోనా వ్యాధికి సంబంధించి ప్రత్యేకమైన మందులు పరికరాలు, కిట్లు ఇంకా ఆసుపత్రికి అందలేదు.

-డాక్టర్ ప్రవీణ్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, రామచంద్రపురం

బాధితుని ఇంటి వద్ద పారిశుధ్య పనులను చేపడుతున్న సిబ్బంది

ఒమిక్రన్ కొత్త వేరియంట్

కరోనా వైరస్ లక్షణాల్లో ప్రస్తుతం వ్యాపిస్తున్న వేరియంట్ ఒమిక్రన్ జె ఎన్ వన్ వైరస్ వేరియంట్‌గా వైద్యులు గుర్తించారు. ఇది 2022లో సోకిన ఓమిక్రమ్ వేరియంట్‌కు సరికొత్త రూపమని, ఇది స్పైక్ ప్రోటీన్ కలిగిన వైరస్ అని వైద్యులు నిర్ధారించారు. కొత్తగా విశ్రమిస్తున్న వేరియంట్ అంత తీవ్రతరమైనది కాదని లక్షణాలు మునుపటి మాదిరిగానే ఉంటాయని, ఇది శ్వాస కోశ వ్యాధిగా వైద్యులు పరిగణిస్తున్నారు. కరోనా వేరియంట్ మాదిరిగానే జలుబు, స్వల్పంగా జ్వరం, దగ్గు వంటి లక్షణాలు ఉంటాయని, వ్యాధి లక్షణాలు బట్టి చికిత్స తీసుకోవాలని, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ఇది సోకుతుందని గుర్తించారు. గతంలో వ్యాక్సిన్లు తీసుకున్న వారిపై అంతగా ఈ వైరస్ ప్రభావం చూపదని అంతర్జాతీయ వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

అందుబాటులో లేని కిట్లు, పరికరాలు ?

దేశంలో కరోనా వైరస్ అనేక రాష్ట్రాల్లో నమోదు అవుతూ విస్తరిస్తున్న సమయంలో ప్రభుత్వ ఆసుపత్రులను ఏరియా ఆసుపత్రులను కరోనా పరీక్షలకు అవసరమైన కిట్లు అందుబాటులో లేవు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా కరోనా పరీక్షలు నిర్వహించేవారు. గత మూడేళ్లుగా కరోనా వైరస్ అంతరించిందని భావించి దానికి సంబంధించిన పరీక్ష కిట్లను, పరికరాలను సరఫరా నిలుపుదల చేశారు. వైరస్ మళ్ళీ పెరగడంతో ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అయితే దీనికి సంబంధించిన వైద్య పరికరాలు, కిట్లు, మందులను అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే ఆక్సిజన్ సిలిండర్లను సిద్ధంగా ఉంచుకుంటే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆర్‌టిపిసిఆర్ టెస్టు కోసం ఏకంగా కాకినాడ జిజిహెచ్‌కు తరలించడమే దీనికి నిదర్శనం.

అప్రమత్తమైన అధికారులు

కె.గంగవరం మండలంలోని సత్యవాడ గ్రామంలో సలాది వెంకట్రావు అనే వ్యక్తికి కరోనా సోకిందన్న వార్తలతో గ్రామంలో కలకలం మొదలైంది. గ్రామపంచాయతీ కార్యదర్శి గౌతమి ఆధ్వర్యంలో శానిటేషన్ పనులు నిర్వహించి బాధితుని ఇంటి వద్ద హైపో క్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేశారు. చుట్టుపక్కల క్లోరినేషన్ నిర్వహించారు. బాధితుని ఇంట్లో గల మిగిలిన వ్యక్తులను వైద్య సిబ్బంది పరీక్షించగా వారికి ఏ విధమైన లక్షణాలు లేవని తెలపడంతో వారిని ఐసోలేషన్లో ఉండాలని సూచించారు. కాగా వెంకట్రావు ఆయన భార్య ఇరువురు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, గ్రామ కార్యదర్శి గౌతమి ప్రజాశక్తికి వివరించారు. కరోనా వైరస్ సోకిందన వార్త వ్యాపించడంతో గ్రామంలో ప్రజల ఆందోళనకు గురయ్యారు.

ధర్నా చేస్తున్న రైతులు

ధాన్యం సొమ్ములు చెల్లించాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన సొమ్ములను వెంటనే చెల్లించాలని, రైతల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని శనివారం డి.ముప్పవరం సెంటర్ వద్ద రైతన్నలు రోడ్డుపై బైటాయించి ధర్నా చేశారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని, బకాయిలు వెంటనే చెల్లించాలని నినదించారు. డి.ముప్పవరంతో పాటూ చుట్టుపక్కల గ్రామాలు చెందిన రైతులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. జెసి, ఆర్‌డిఒ వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వారి ఆందోళనతో భారీగా వాహనాలు స్తంభించాయి. అకాల వర్షాలతో ఎంతో నష్టపోయామన్నారు. తరువాత అనుమతులు లేవంటూ 8,600 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయలేదన్నారు. వీటిని కొనుగోలు కేంద్రాల వద్ద పెట్టుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా నేటికీ డబ్బులు జమేయలేదని తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ కె.వీరబాబు అక్కడి చేరుకుని రైతులతో మాట్లాడారు. అయినప్పటికి రైతులు కదల్లేదు. సంబంధిత అధికారులు వచ్చి సమాధానం చెప్పేవరకూ విరమించేది లేదని స్పష్టం చేశారు. దీంతో కొవ్వూరు ఎడిఎ చంద్రశేఖర్, ఎఎస్ఒ నాగాంజనేయులు, ఎఒ జి.సత్యనారాయణ అక్కడికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. త్వరలోనే డబ్బులు జమయ్యేలా చూస్తామని, ప్రతి ధాన్యం గింజను కొంటామని హామీ ఇచ్చారు. దీంత రైతులు ఆందోళనను విరమించారు.

సినీ పరిశ్రమ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం...

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

సినీ పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం రాజమహేంద్రవరంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడారు. సినీ పరిశ్రమకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరించారు..జూన్ 1వ తేదీ నుంచి సినిమా థియేటర్ల బంద్ చేయబోతున్నారన్న విషయం కొన్ని రోజులుగా ప్రచారంలోకి వచ్చిందన్నారు. దీనిపై విచారణ నిర్వహిస్తామన్నారు. చిత్ర పరిశ్రమకు ఉపయోగపడే విధానాలను అవలంబించేందుకు వీలుగా ఉంటుందన్న ఉద్దేశంతో ఈ విచారణను నిర్వహిస్తున్నామన్నారు.దీనిపై హోం శాఖ సెక్రటరీ కుమార్ విశ్వజిత్‌తో చర్చించానన్నారు. ఈ అంశంపై లోతుగా విచారణ చేయాలని ఆదేశించానని తెలిపారు. తద్వారా అసలు విషయం వెలుగులోకి వస్తుందని, అనంతరం తమ చర్యలుంటాయన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సినీ పరిశ్రమకు చెందిన పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను ఆరా తీసి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటివరకు సినీ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ ఆకస్మికంగా థియేటర్ల బంద్ అనే అంశం తెరపైకి ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదన్నారు. దీని వెనుక ఉన్న కారణాలను ఆరా తీస్తున్నామన్నారు. జూన్ 12న పవన్ కళ్యాణ్ హరిహరవీరమల్లు చిత్రం విడుదలవుతున్న సందర్భంలో ఈ రకమైన వాతావరణం ఎందుకు వచ్చిందో తెలియడం లేదన్నారు. ఇది ఎంత మాత్రం సరికాదన్నారు.

సాయం అందిస్తున్న స్నేహితులు

స్నేహితునికి చేయూత

ప్రజాశక్తి- కడియం

"స్నేహానికన్న మిన్న లోకాన లేదురా" అని ఓ సినీ కవి అన్నారు. దీన్ని నిజం చేసి చూపించారు కడియం గ్రామానికి చెందిన తోటకూర శ్రీనివాస్ స్నేహితులు. తోటకూర శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లితండ్రి ఉన్నారు. మూడేళ్ల క్రితం ఇంట్లో పిల్లలతో ఆడుకుంటూ పడిపోయాడు. అప్పటి నుంచి నడుము, ఒక చెయ్యి పనిచేయక పోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. అప్పటి నుంచి ఆయన తల్లిదండ్రులో శ్రీనివాస్ కుటుంబానికి దిక్కుగా ఉన్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం కుటుంబ పోషణసైతం వారికి భారంగా మారింది. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ స్నేహితులు 'మేమున్నామంటూ' ముందుకు వచ్చారు. సలాది శ్రీనివాస్, గరగ రాంబాబు, కడిం గణేష్, షేక్ రహతుల్లా, అక్కివరపు సతీష్, జి దుర్గ, మేరీ సునీల, కుమారి తదితరులు కలిసి తమ స్నేహితుని కోసం రూ.77వేల నగదును శనివారం అందించారు. రెండేళ్ల క్రిందట వీరందరూ కలిసి రూ.50 వేలు అందించారు. మంచానికే పరిమితమైనా శ్రీనివాస్‌కు నేటికీ పింఛను రావట్లేదని భార్య, తల్లిదండ్రులు తెలిపారు. సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి పింఛను వచ్చే ఏర్పాట్లు చేసి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నామన్నారు.

నగరంలో పార్కుల సుందరీకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని అందించేలా నగరంలో పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో పార్కుల అభివృద్ధి పనులపై అధికారులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యాకేజీ - 1 లో భాగంగా చేపట్టిన పనుల ప్రగతిపై డివిజన్ల వారీగా ఆరా తీశారు. వివిధ దశల్లో ఉన్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో రాజీ పడరాదని.. నిర్దిష్టమైన కాలపరిమితితో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర అభివృద్ధిలో భాగంగా దశల వారీగా పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. .మొత్తం నాలుగు ప్యాకేజీలుగా పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్యాకేజీ -1లో రూ.1.96 కోట్లతో ఏడు పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే మూడు పార్కుల్లో పనులను ప్రారంభించామన్నారు. 9వ డివిజన్‌లోని స్టేట్ బ్యాంక్ కాలనీ పార్కులో చిన్నారుల కోసం ఆట వస్తువులతో పాటు విశాలమైన వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. పార్కులో బ్యాడ్ మింటన్ కోర్టు, జిమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 10వ డివిజన్ లోని ఆల్ బ్యాంక్ కాలనీ పార్కును మ్యూజికల్ పార్కుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అందరినీ ఆకర్షించేలా వివిధ సంగీత వాయిద్యాలతో కూడిన శిల్పాలు ఉంటాయన్నారు. 10వ డివిజన్‌లోని మోడల్ కాలనీ పార్కును యోగా పార్కుగా తీర్చిదిద్దనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఉదయం సాయంత్రం వేళల్లో స్థానికులు సరదాగా గడపడానికి దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఈ పార్కులు దోహదపడతాయన్నారు. ఇప్పటికే పనులు వేగవంతంగా జరుగుతుండగా.. త్వరలోనే పూర్తి చేసి పార్కులను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఆయన వెంట ఇంజినీరింగ్ ఎస్ఇ ఎం.కోటేశ్వరరావు, ఇఇ మదర్సా ఆలీ షేక్, ఎడి హెచ్.స్వాతి, డిఇ కె.విరూపాక్షరావు, ఎఇలు సత్యనారాయణ, సంజయ్, డేవిడ్, ఇతర సిబ్బంది ఉన్నారు.

పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

మదర్ థెరిసా హోమ్‌లో మిస్సింగ్ చిల్డ్రన్స్ డే

ప్రజాశక్తి -కొవ్వూరు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలమేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వూరులో శనివారం మిస్సింగ్ చిల్డ్రన్స్ డేను నిర్వహించారు. జిల్లా 9వ అదనపు జడ్జి ఎం.అనురాధ మదర్ థెరిస్సా హోమ్‌ను సందర్శించి అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలి అని సూచించారు. చదువును నిర్లక్ష్యం చేయరాదని పిల్లలకు సూచించారు. దేశ నాయకులు, మహనీయుల జీవిత చరిత్రలను చదవడం ద్వారా వారు సాధించిన విజయాల ద్వారా స్ఫూర్తిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది శ్రీవల్లి, మదర్ థెరెసా హోమ్ కన్వీనర్ బి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు .

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

తమ సమస్యలు పరిష్కరించాలని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావుకు విద్యుత్ ఉద్యోగులు శనివారం వినతిపత్రం అందించారు. జెఎసిసి వైస్ చైర్మన జి.అబ్రహాం విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ఎంఎల్ఎకు వివరించారు. ఇపిఎఫ్, జిపిఎఫ్ ఇతర సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వెంకటేశ్వర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్యలను తీసుకెళ్తానన్నారు.

స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

అన్నదేవరపేటలోని ఖ్యాతి కార్ డిస్టలరీ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీలో స్థానికులకు అవకాశం కల్పించాలని, గ్రామాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సంస్థ విస్తరణ కోసం శనివారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు మాట్లాడారు. గ్రామస్తులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, స్థానిక పాఠశాలల అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని కోరారు. కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత, ఇన్‌ఛార్జి తహశీల్దార్ మోహన భారతి, పొల్యూషన్ బోర్డ్ ఇఇ శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రజాభిప్రాయ సేకరణలో కంపెనీ ప్రతినిధి సంతోష్ కుమార్ విస్తరణ పనులను వివరించారు. కంపెనీ సామర్థ్యం 90 కెఎల్ నుంచి 180 కేఎల్‌కు పెంచుతున్నామన్నారు. కంపెనీ విస్తరణ వల్ల ఎలాంటి జల, వాయు కాలుష్యం ఉండదన్నారు. పచ్చదనాన్ని పెంపొందించే విధంగా ఏడు ఎకరాల్లో మొక్కలు పెంపకం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం కృష్ణన్ ఉన్నతన్, జిఎం మూర్తి, సర్పంచ్ ఎలిపే సుధారాణి, స్థానిక నాయకులు పోసిన శ్రీకృష్ణదేవరాయలు, నంద, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దివాన్ చెరువు పంచాయతీ కార్మికులకు వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివిఎన్.పూర్ణిమారాజు డిమాండ్ చేశారు. దివాన్ చెరువు పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అక్కిరెడ్డి గణపతి అధ్యక్షతన శనివారం దివాన్ చెరువు సిఐటియు కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పూర్ణిమారాజు హాజరై మాట్లాడారు. పంచాయతీ కార్మికుల మార్చి, ఏప్రిల్‌కు సంబంధించిన వేతనాలు నేటికీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. వెంటనే ఈ బకాయిలు చెల్లించాలన్నారు. పంచాయతీలో 30 ఏళ్లుగా పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారన్నారు. నేటికీ వారికి ఇఎస్ఐ సౌకర్యం లేకపోవడం దారుణమన్నారు. కనీస వేతనాలు కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, అందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, లీవు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు చెప్పులు, కొబ్బరినూనె, సబ్బులు, గ్లౌజులు, రెయిన్ కోట్లు ఇవ్వాలన్నారు. తుక్కు ట్రాక్టర్లు పాడవ్వడంతో కార్మికులు గాయపడుతున్నారన్నారు. ప్రాణపాయ స్థితికి చేరుకున్నా కనీసం వైద్య సాయం కూడా అందించకపోవడం దారుణమన్నారు. గాయపడిన వేమగిరి పెద్ద రాంబాబుకు వైద్యా ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు తాళ్లపూడి మంగ, వేమగిరి సతీష్, మల్లరపు వసంతాలు, నీలపు గౌరి, మందపల్లి విజయ్, గాలంకి లాజర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులతో పూర్ణిమారాజు తదితరులు

కార్టూ'నిజం'



కొండవీటిలో విలువలతో కూడిన విద్య

కెఎస్‌డి.ఆశీర్వాదం
సెక్రటరీ, కరస్పాండెంట్

ప్రజాశక్తి - గోపాలపురం

గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య, మధ్య తరగతి విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందిస్తున్న విద్యాసంస్థ కొండవీటి విద్యాసంస్థలు అని సెక్రటరీ కరస్పాండెంట్ కెఎస్‌డి.ఆశీర్వాదం తెలిపారు. విద్యా సంస్థల ప్రాముఖ్యత, సాధించిన విజయాలు, లక్ష్యాలపై ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఉన్నత ఆశయాలే లక్ష్యంగా నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే కొండవీటి విద్యా సంస్థలు ఆశయమన్నారు. శ్రీ గౌతమి జూనియర్ కళాశాల, కొండవీటి డిగ్రీ కళాశాలలను తాము నిర్వహిస్తున్నామన్నారు. గోపాలపురంలో 2001లో స్థాపించిన శ్రీ గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యున్నత స్థాయి ఫలితాలు సాధిస్తున్నారన్నారు. 2014లో కొండవీటి డిగ్రీ కళాశాల, కొండవీటి ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో ప్రారంభించామన్నారు. నాటి నుంచి తమ విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. 2022లో కొండవీటి నర్సింగ్ కళాశాలను స్థాపించామన్నారు.

గోపాలపురం మండల పరిసర ప్రాంతాలలో విద్యార్థులు దూర ప్రాంతాలలోని పట్టణాలకు వెళ్లే అవసరత లేకుండా వారి కలలు సహకారం చేసేందుకు పలు రకాల కోర్సులను అందుబాటులో ఉంచాన్నారు. మెయిన్ గ్రూపులతో పాటు ఒకేషనల్ కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన అందిస్తున్నామని తెలిపారు. కార్పొరేట్‌కు ధీటుగా క్రమశిక్షణ, విలువలతో కూడిన ఒత్తిడి లేని విద్యను అందించడం తమ ప్రత్యేకత అన్నారు. ఇటీవల వెలువడిన ఇంటర్, డిగ్రీ ఫలితాలే తమ బోధనకు నిదర్శనమన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు.

అందుబాటులో ఉన్న కోర్సులు

ఇంటర్‌లో ఎంపిసి, బైపిసి, సిఇసి కోర్సులు
ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్), ఎంఎల్ టి వంటి ఒకేషనల్ కోర్సులు
డిగ్రీలో బిఎస్‌సి హానర్స్, కంప్యూటరు సైన్సు, జువాలజీ, బి.కాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎ స్పెషల్ తెలుగు, పొలిటికల్ సైన్స్, జిఎన్ఎం నర్సింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

పాఠశాల భవనం

విద్యార్థులు

విద్యాసంస్థల ప్రత్యేకతలు

- విశాలమైన తరగతి గదులు, ల్యాబులు
- కంప్యూటర్ పరిజ్ఞానంపై ఉచిత శిక్షణ
- ఆర్ఒ వాటర్ సదుపాయం, సిసి కెమెరాల పర్యవేక్షణ
- విశాలమైన క్రీడా ప్రాంగణంలో క్రీడల శిక్షణ
- సువిశాలమైన ప్రదేశంలో కళాశాల భవనం
- సిసి కెమెరాల పర్యవేక్షణలో విద్యార్థులు
- బాలురు, బాలికలకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం
- ప్రతి రోజూ స్టడీ అవర్స్, డైలీ టెస్టుల నిర్వహణ
- విద్యార్థులకు అందుబాటులో లైబ్రరీ, ల్యాబ్‌లు

ఇంటర్మీడియట్ ప్రిన్సిపల్ వై.ప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సంపత్‌కుమార్, స్కూల్ అఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ సిహెచ్.అనూష పర్యవేక్షణలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామన్నారు.

ఎంతో మంది తమ విద్యార్థులు ప్రభుత్వ శాఖల్లో ఉన్నతమైన ఉద్యోగాలు సాధించారన్నారు. సాఫ్ట్‌వేర్ తదితర రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. సామాన్య, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామన్నారు. అలాగే సామాజిక బాధ్యతగా కెఎస్ఆర్ ట్రస్టు ఆధ్వరయంలో ఉచిత అంబులెన్స్‌ను నిర్వహిస్తున్నామన్నారు. తమకు సహకరిస్తున్న శ్రేయోభిలాషులు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని, వివరాలకు కళాశాలను సంప్రదించాలన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి డైమండ్ జంక్షన్ సమీపంలోని గోల్డెన్ ఫిష్ రెస్టారెంట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. గోకవరం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఇద్దరుపిల్లలుతో బంధువుల ఇంటికి బైకుపై వెళ్తున్నారు. వీరు గోల్డెన్ ఫిష్ రెస్టారెంట్ సమీపానికి వచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని కందులపాలెం వంతెన వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు పంపన శివశ్రీనివాస్ తీవ్ర గాయాల పాలయ్యాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. యండమూరి గ్రామానికి చెందిన శివశ్రీనివాస్ ఎలక్ట్రిషన్‌గా రామచంద్రపురంలో పనిచేస్తున్నాడు రాత్రి 9:30 ప్రాంతంలో పనిముగించుకుని ఇంటికి వెళుతుండగా స్థానిక కందులపాలెంలోని దుర్గమ్మ గుడి వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్ రిఫర్ చేశారు. దీనిపై ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలో రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. చెందుర్తి గ్రామానికి చెందిన మేడిద ధర్మేంద్ర వరప్రసాద్ (34) ఆటోలో పిఠాపురం వైపు వెళుతుండగా గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద పాల ట్యాంకర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ధర్మేంద్ర వరప్రసాద్, మరొక మహిళ బి.లోవ కుమారి గాయపడ్డారు. వారిని పిఠాపురం ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి ధర్మేంద్ర వరప్రసాద్ మృతి చెందాడు.. కుమారిని మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

బంగారం చోరీ నాలుగు గంటల్లో రికవరీ

ప్రజాశక్తి కాకినాడ

చోరీకి గురైన 22 కాసుల బంగారాన్ని ఫిర్యాదు అందిన నాలుగు గంటల్లోనే రెండవ పట్టణ పోలీసులు రికవరీ చేసి నిందితుని అరెస్టు చేశారు. స్టేషన్ ఎస్‌హెచ్ఒ ఎల్.అప్పలరాజు తెలిపిన వివరాల మేరకు కాకినాడ 2వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని, విద్యుత్ నగర్ ఎస్‌బిఐ కాలనీలో ప్రభుత్వ ఉద్యోగి వి.మణి నివసిస్తున్నారు. శుక్రవారం ఇంటికి తాళం వేసి ఆమె విధులకు హాజరై సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా బీరువాలో దాచుకున్న 22 కాసుల బంగారు ఆభరణాలు, ఇతర వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసు సిబ్బంది, క్లూస్ టీమ్‌తో నేర స్థలానికి చేరుకుని క్లూస్ సేకరించి, 4 గంటల వ్యవధిలో కేసును చేధించారు. నిందితుని పట్టుకుని దొంగిలించిన బంగారు నగలను రికవరీ చేశారు.

అక్రమ మద్యం స్వాధీనం నలుగురు అరెస్టు

ప్రజాశక్తి- తాళ్ళరేవు

మండలం అరటికాయలంక వద్ద ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సి.ఐ. కొండ కోటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు అరటికాయలంక చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు కార్లు, ఒక బైకుతో నలుగురు వ్యక్తులు అక్రమ మద్యం సీసాలతో పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 23 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు నాగేంద్ర కృష్ణ, నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో మహిళ అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట అంబటివారి తోటలోని సింగవరపు సత్యానారాయ గృహంలో జరిగిన చోరీలో నిందితురాలైన సామర్లకోట బల్ల మార్కెట్ సెంటర్‌కు చెందిన బొడ్డు దుర్గాదేవిని పోలీసులు శనివారం సాయంత్రం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఆమె నుంచి రూ.ఆరు లక్షల విలువైన బంగారం, వజ్రాలు, ఒక స్మార్ట్ ఫోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని కాకినాడ కోర్టులో హాజరు పరిచినట్టు సిఐ కృష్ణ భగవాన్ చెప్పారు. తెలిపారు.

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రీ మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల కేంద్రమైన జగ్గంపేట బాలాజీ నగర్‌లోని ఒక ఇంటిలో పని చేస్తున్న తాపిమేస్త్రీ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన సుంకర రాజు (35) పదేళ్లుగా జగ్గంపేటలో నివసిస్తున్నాడు. ప్రతి రోజులానే శనివారం ఉదయం పనికి వెళ్ళి బాలాజీ నగర్‌లోని ఒక ఇంటిలో సెంట్రింగ్ పని చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతన్ని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య నాగలక్ష్మి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పేకాడుతున్న ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

సూరంపాలెం రహదారిలోని జగనన్న కాలనీలో శనివారం ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.7,420 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అసంతృప్తి కేరాఫ్ మహానాడు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేర్వేరుగా జరిగిన టిడిపి మినీ మహానాడు సభలు తెలుగు తమ్ముల అసంతృప్తికి వేదికలయ్యాయి. ముఖ్యనేతలు బహిరంగానే ఈ సంతృప్తిని వెళ్లగక్కారు. అదీ ఇన్‌ఛార్జి మంత్రుల సమక్షంలోనే నిలదీయడం చర్చనీయాంశమైంది. గతేడాది రాష్ట్ర మహానాడు కార్యక్రమంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన విషయం విధితమే. 2024 ఎన్నికల ముందు నిర్వహించిన ఈ మహాసభ ఆ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపటంతో పాటు అప్పటి అధికార పార్టీ వైఫల్యాలను సమర్ధవంతంగా ఎండగట్టారు. అనంతరం చంద్రబాబు అరెస్టు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పరామర్శ, మద్దతు ప్రకటన ఆపై బిజెపితో పొత్తు వెరసి వరుస పరిణామాలు అధికార పార్టీకి బలమైన ప్రత్యామ్నాయంగా మారాయి. ఈ నేపథ్యంలోనే ఎన్నికల్లో కూటమి నేతలు విజయ ఢంకా మోగించారు. అయితే గెలిచిన మరుసటి రోజు నుంచే పదవుల పంపకాలు చర్చనీయాంశంగా మారాయి. బిజెపి, జనసేన నాయకులకు పదవుల కేటాయింపులు ఎక్కువగా జరుగుతున్నాయనే అసంతృప్తి టిడిపి నేతల్లో తేటతెల్లమైంది. ఎరో వైపు ఎప్పటి నుంచే ఉన్న గ్రూపుల పోరు మరింత తారాస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన మహానాడు కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కాకినాడలో జరిగిన జిల్లా మహానాడులో సీనియర్ నేత, జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తీవ్ర విమర్శలు చేశారు. నిష్పత్తి ప్రకారం పదవులు కేటాయించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ ముందే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అయితే దీనిపై జనసేన, టిడిపి నాయకులు గుర్రుగా ఉన్నప్పటికీ ఎవరూ ఎలాంటి కామెంట్లు చేయకుండా అధిష్టానం జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం.

ఎండల నుంచి ఉపశమనం

భానుని ప్రతాపానికి అల్లాడిన ప్రజలకు మారిన వాతావరణం కాస్తంత ఊరట నిచ్చింది. పల్లెలు, పట్టణాలలో సామాన్య ప్రజానీకంతోపాటు పాడి రైతులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. జీవాలకు ఊరట లభించిందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడన ద్రోణి కారణంగాఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు ముందుగానే వస్తున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించిన విషయం విధితమే. తాజా వర్షాలు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతాంగంలో ఉత్సాహాన్ని నింపుతోంది. అయితే సాగుకు పెట్టుబడులు లేక రైతులు ఆర్ధిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహకం లేకపోవటం, మరో వైపు బ్యాంకు రుణాల రెన్యువల్స్ గోరుచుట్టుపై రోకలి పోటులామారాయి. రుణాల రెన్యువల్స్ కోసం,సాగు పెట్టుబడి కోసం అప్పులు చేయలేక అవస్థలు పడుతున్నారు. మరోవైపు ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని సుస్పష్టమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ధాన్యం దిగుబడికి, ప్రభుత్వ కొనుగోలు లక్ష్యానికి పొంతనే లేదు. ఇప్పటికి రైతుల వద్ద దిగుబడులు నిలిచిపోవటంతో రైతులు ఆందోళన బాట పడుతున్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేసి అండగా నిలవాలని రైతులు, రైతు సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

మళ్లీ కరోనా కలవరం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరంలో కరోనా కేసు నమోదవ్వడంతో జిల్లా ప్రజలకు కలవరానికి గురయ్యారు. ఇప్పుడిప్పుడే కరోనా నుంచి కోలుకుంటున్న తరుణంలో ఒమిక్రాన్ కొత్త రకం వైరస్ జిల్లాకు కూడా వ్యాపించడంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. కె.గంగవరం మండలం సత్యవాడలో వృద్ధునికి కరోనా పాజిటివ్ రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వృద్ధునితో పాటు అతని భార్య, కుమారుడు, కోడలు, మనవరాలని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. అక్కడ ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. పాజిటివ్ కేసు నమోదైన గ్రామంలో పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేస్తున్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, కోవిడ్ నిబంధనలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పల్లెలతో పాటు పట్టణాలలోనూ పారిశుధ్య నిర్వహణ అస్తవస్తంగా మారింది. ప్రజారోగ్య విభాగలంలో కార్మికుల కొరత వెంటాడుతోంది. తాజాగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పల్లెలు, పట్టణాలు చిత్తడిగా మారుతున్నాయి. శివారు ప్రాంతాలు దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. విష జ్వరాలు విజృంభించే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

గోదారి గలగలలు

పనులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

రైతుల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. నియోజకవర్గంలో రూ.7 కోట్లతో రైతులకు అవసరమైన పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. కొవ్వాడ కాలువ డీ సిల్టేషన్ పనులను గజ్జరం గ్రామంలో ఆయన శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రూ.4 కోట్లతో పుంత రోడ్ల పనులు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రైతుల అభివృద్ధి కోసం పనిచేస్తున్నారన్నారు. శనివారం ప్రారంభించిన కొవ్వాడ కాలువ పూడిక తీత వల్ల నియోజకవర్గంలోని అన్నదేవరపేట, తిరుగుడు మెట్ట, గజ్జరం, తుపాకులగూడెం, ధర్మవరం, కాపవరం, చాగల్లు మండలంలోని పలు గ్రామాలకు నీరు సక్రమంగా ప్రవహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కె.రామకృష్ణ, ఎంపిపి నారాయుడు, గజ్జరం ఉపసర్పంచ్ శేషు, టిడిపి నాయకులు కొట్టూరు వెంకట్రావు, కవల రామాంజనేయులు, మైనం గంగరాజు, గన్నిన సత్తిబాబు పాల్గొన్నారు.

పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శివాలయం గుడి సెంటర్లోని జల్లూరి వీర్రాజు ఇంటి వద్ద శనివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పెద్దాపురంలో ఇంటింటికి పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా ప్రారంభించారు. భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జల్లూరి వీర్రాజుకు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప మొదటి గ్యాస్ కనెక్షన్ ఇచ్చి గ్యాస్ పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ తుమ్మలబాబు, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి విత్తనాల వెంకటరమణ, రాజా సూరిబాబురాజు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గెడ్డం పెదకాపు, రంధి సత్యనారాయణ, తూతిక రాజు, ఉల్లి సత్యనారాయణ, అనివిళ్ల శాస్త్రి, బి.సత్తిబాబు, పి.సత్తిబాబు, ఒబిలిశెట్టి గున్ని పాల్గొన్నారు.

కరోనా పట్ల భయం వద్దు : మంత్రి

ప్రజాశక్తి - రామచంద్రపురం

కరోనా పట్ల ఆందోళన వద్దని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కె. గంగవరం మండలం సత్యవాడకు చెందిన సలాది వెంకట్రావు(64)కు రాపిడ్ టెస్టులోను, ఆర్‌టిపిసిఆర్ టెస్ట్‌లోనూ కరోనా పాజిటివ్ వచ్చిన నేపథ్యంలో మంత్రి స్పందించారు. బాధితుడిని కాకినాడ ఆసుపత్రికి తరలించడం జరిగిందని, కరోనా వైరస్‌పై ప్రజల్లో అవగాహన కోసం ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. ప్రజలు జన రద్దీగా ఉన్న ప్రాంతాల్లో మాస్కులు ధరించాలని కోరారు. కరోనా పాజిటివ్ వచ్చిన వెంకట్రావుకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రత్యేక వార్డులో ఉంచి వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. కరోనా వైరస్ తేలికపాటి లక్షణాలు మాత్రమే ఉన్నాయని, ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సమాచారం ఇచ్చారని తెలిపారు. ప్రజలు భయాందోళన అవసరం లేదని సూచించారు. కరోనా వైరస్ లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-చాగల్లు

వికలాంగుల సర్వేను సక్రమంగా నిర్వహించాలని సెక్టోరియల్ ఆఫీసర్ ఎన్.కనకబాబు సిబ్బందికి సూచించారు. శనివారం ఎస్.ముప్పవరం గ్రామంలో జరుగుతున్న వికలాంగుల సర్వేను ఆయన పరిశీలించారు. వికలాంగులను భవిత కేంద్రంలో చేర్చి చిన్నారులకు బంగారు భవిష్యత్తును కల్పించాలని తల్లిదండ్రులను ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఎం.శిరీష, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో అనధికారికంగా నిర్మించిన పక్కా ఇంటి నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒ 30 ప్రకారం 15 అక్టోబర్ 2019 కంటే ముందుగా అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో అనధికారికంగా నిర్మించిన పక్కా ఇంటి నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తామన్నారు. ఇంటి పన్ను, కరెంటు బిల్లులతో గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 150 చదరపు గజాల్లో నిర్మించిన ఇంటిని ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్నారు. దరఖాస్తులను మండల కమిటీ, డివిజనల్ కమిటీలు పరిశీలించి, క్రమబద్ధీకరిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు సచివాలయాలు, గ్రామ రెవిన్యూ అధికారులను సంప్రదించాలని కోరారు.

జీవశాస్త్రం పరీక్షకు 1,325 మంది హాజరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన జీవశాస్త్రం పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 1927 మందికి 1,325 మంది హాజరయ్యారని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. 28 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించామన్నారు. ఓపెన్ స్కూల్ పదవ తరగతి అడ్వాన్సు సప్లిమెంటరీకి సంబంధించి సాంఘిక శాస్త్రం పరీక్షకు 238 విద్యార్థులకు 113 మంది హాజరయ్యారు. ఇంటర్మీడియట్ అడ్వాన్సు సప్లిమెంటరీకి సంబంధించి జీవ శాస్త్రం, వాణిజ్య, వ్యాపార శాస్త్రం పరీక్షలు జరిగాయి. 166 మందికి 108 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు.

పచ్చి రొట్ట విత్తనాల కిట్లు సిద్ధం

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం రైతు సేవా కేంద్రంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది ఎంటిఎల్ బసవన్న గౌడ్, ఎంటిఎల్ దేవి, అబ్బులు ఆధ్వర్యంలో 3వ విడత నవధాన్యాల కిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి, రెండో విడదతో 1000 కిట్లను రైతులకు అందించామన్నారు. పచ్చిరొట్టపై అవగాహన కల్పించామన్నారు. మూడవ విడతగా 600 కిట్లు తయారుచేసి రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ, విఎఎ, యూనిట్ ఇన్‌ఛార్జిలు, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

రాకేష్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాగల్లు

గోదావరిలో ప్రమాద వశాత్తూ మునిగి మృతి చెందిన గాడి రాకేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావుకు శనివారం వినతిపత్రం అందించారు. వారి తల్లిదండ్రులు చిన్న పూరిగుడెసెలో జీవిస్తున్నారన్నారు. రాకేష్ చదవు మానే వారి కోసం కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడన్నారు. రాకేష్ మరణంతో వారు అనాథలయ్యారన్నారు. వారిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు.

అనుమతి లేని ఇసుక తవ్వకాలను ఆపాలి

ప్రజాశక్తి - సీతానగరం

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అనుమతి లేని ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపేయాలని ములకల్లంక ప్రజలు డిమాండ్ చేశారు. శనివారం ములకల్లంక బ్లాక్-1లో ఇసుక తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ములకల్లంక పంచాయతీ కార్యాలయం వద్ద ఈ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. గోదావరి నది నుంచి ఏడాదికి 60,090 క్యూబిక్ మీటర్లు, 90,135 టిపిఎ ఇసుక తవ్వకానికి సంబంధించిన ప్రతిపాదనలపై చర్చ జరిగింది. ఇసుక తవ్వకాల వల్ల పర్యావరణంపై పడే ప్రభావం, నదీ పరిరక్షణ, భూగర్భ జలాల స్థాయిలు, మరియు స్థానిక జీవనోపాధిపై చర్చ జరిగింది. కొంతమంది స్థానికులు ఇసుక తవ్వకాల వల్ల నదీ కోతకు గురవుతుందన్నారు. వ్యవసాయానికి నీటి కొరత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక లారీల రాకపోకలతో రహదారులు ఛిద్రమవుతున్నాయన్నారు. రవాణా సమస్యలు తలెత్తుతాయన్నారు. పర్యావరణ నిబంధనలకు లోబడి ఇసుక తవ్వకాలు జరుగుతాయని హామీ ఇచ్చారు. అయితే చాలామంది ప్రజలు ఈ హామీల పట్ల సంతృప్తి చెందలేదు. అనుమతి లేని ఇసుక తవ్వకాలను పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చే ముందు పర్యావరణ ప్రభావ అంచనా నివేదికను సమగ్రంగా పరిశీలించాలని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు, తిరిగి సాయంత్రం 4 గంటకు మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-గోకవరం

ప్రతి ఇంటికీ తాగునీటిని అందించడమే ధ్యేయమని గోకవరం మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నబాబు అన్నారు. స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సారథ్యంలో జగ్గంపేట నియోజవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. కృష్ణుని పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి 20వేల లీటర్ల కెపాసిటీతో జల్‌జీవన్ నిధులు రూ.17.20 లక్షలు కేటాయించారాన్నారు. త్వరలోనే ట్యాంకు నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణకుమారి, రూరల్ వాటర్ సప్లయ్ సహాయ ఇంజినీర్ ఎంవి.రామకృష్ణ, టిడిపి మండల ఉపాధ్యక్షులు మండిగ బాలాజీ, మీడియా మండల కో-ఆర్డినేటర్ కొంగరపు రాజు, తెలుగు రైతు మండల సెక్రటరీ బోలకొండ రాజారెడ్డి, 3వ బూత్ ఇంచార్జ్ దిబ్బ శ్రీను, మాజీ సర్పంచ్ రౌతు వెంకటేశులు పాల్గొన్నారు.

హాజరైన నాయకులు

రానున్న కాలంలో బిఎస్‌పిదే అధికారం

ప్రజాశక్తి - పెరవలి

రానున్న కాలంలో బిఎస్‌పిదే అధికారం అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ అన్నారు. బిఎస్‌పి రాష్ట్ర వ్యాప్తంగా బహుజన సంకల్ప సభలను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా శనివారం పెరవలి జాతీయ రహదారి మెయిన్ రోడ్‌లో ఉన్న ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నియోజకవర్గ అధ్యక్షుడు బయ్యే మునింద్ర అధ్యక్షతన ఈ సభను నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా గౌతమ్‌కుమార్ హాజరై మాట్లాడారు. దేశంలో అతి పెద్ద 3వ పార్టీగా బిఎస్‌పి ఉందన్నారు. అణగారిన వర్గాలకు అండగా ఉంటుందన్నారు మిగిలిన రాజకీయ పార్టీలు కింది కులాలను మోసం చేస్తూ ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నా యన్నారు. రాబోయే రోజుల్లో బిఎస్‌పి మాత్రమే అధికారంలోకి వస్తుందన్నారు. దీని కోసం నాయకులు, కార్యకర్తలు అలుపెరుగని యోధుల్లా పని చేయాలన్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఎస్‌పి సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుమ్మాపు చిత్రసేను, నాయకులు కొల్లాబత్తుల సత్యం, ఏలూరి అశోక్‌కుమార్, మూరల రత్నరాజు, జిల్లా అధ్యక్షులు పట్నాల విజయ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

సర్టిఫికెట్ పడిపోయినది

గంజా సత్య భార్గవి, తండ్రి: వీర రాఘవులు, ముమ్మిడివరం మండలం, కొత్తలంక పంచాయతికి చెందిన నేను 2015లో ఎస్ఎస్‌సి మరియు 2021లో బి టెక్ (ఇసిఇ) పూర్తి చేసియున్నాను. ది. 12-05-2025న నా ఒరిజినల్ మార్కు లిస్టులను జిరాక్స్ నిమిత్తము ఆటోలో ఇంటి నుండి ముమ్మిడివరం హైస్కూల్ సెంటర్‌కు వచ్చి చూసుకొనగా ఎస్ఎస్‌సి మరియు బి టెక్ మార్క్ లిస్టుల ప్రొవిజినల్ సర్టిఫికెట్స్ పడిపోయినవి. వెంటనే మార్కుల లిస్ట్‌ల కోసం వెతకగా దొరకలేదు. నా మార్కుల లిస్ట్‌లు ఎవరికైనా దొరికిన యెడల నాకు అందజేయగలరని కోరి ప్రార్థిస్తున్నాను. అందజేసిన వారికి తగు పారితోషికం ఇవ్వబడును.

గంజా సత్య భార్గవి,
తండ్రి: వీర రాఘవులు, డోర్ నెం. 5-27, కొత్తలంక,
ముమ్మిడివరం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్ నెం.79958 61597

ప్రకటన

కీ॥శే॥ పొత్తూరి వెంకట సుబ్బరాజు (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం మండలం, చిన కొత్తలంక పంచాయతీ గ్రామ కాపురస్తుడు వెంకట సుబ్బరాజు (లేటు), తండ్రి: సుబ్బరాజు (లేటు)ల కుమారుడు పొత్తూరి వెంకట సూర్యనారాయణరాజు వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

నా తమ్ముడు పొత్తూరి వెంకట సుబ్బరాజు (లేటు) చిన కొత్తలంక పంచాయతీ పరిధిలోని మా ఇంటి వద్ద ది. 14-01-2022 సం॥లో మరణించారు. వీరి మరణం నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: పొత్తూరి వెంకట సూర్యనారాయణరాజు
తండ్రి: సుబ్బరాజు (లేటు), డోర్ నెం.1-79,
చిన కొత్తలంక పంచాయతీ, ముమ్మిడివరం మండలం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, సెల్: 9705127606

ముఖ్య ప్రకటన

ప్రస్తుత కాశీ నివాసస్తులు లోగడ కాకినాడ మరియు విజయవాడ నివాసమైన నా క్లయింటు **శ్రీ దుగ్గిరాల వెంకట్రావుగారి కుమారుడైన కనకదుర్గా లక్ష్మీ గణపతి ప్రసాదు** అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీపై, యావన్మందికీ తెలియజేయునది ఏమనగా -

వార్కి రాజమండ్రిలో ఉండగా 2018వ సం॥లో వారి భక్తులైన రత్నం రాజేష్, వారి భార్యగారైన బాలా త్రిపుర సుందరి అనువారు, నా క్లయింటు ఆధ్యాత్మిక జీవనములో అనేకమంది అవసరాలలో, కష్టాలలో ఉంటారు, మావద్ద కొంత సొమ్ము ఉన్నది, తక్కువ వడ్డీతో పేదలకు, మాక్లయింటు మాట వినేవారు, నమ్మకస్థులకు సహాయం చేయమనిన్నీ, కాని పూర్తి బాధ్యత నా క్లయింటుదే అనిన్నీ నా క్లయింటుకు దఫదఫాలుగా 15-10-18 నుండి 20-11-19వ ర్కు సుమారు 40,20,000 - (నలభై లక్షల ఇరవై వేల రూపాయిలు) బ్యాంకు ట్రాన్స్‌ఫరు చేసియున్నారు. మొదటి రోజునినే అనగా 15-10-18వ తేదీననే సదరు రాజేష్, వారి భార్య సుందరిగారు, నా క్లైయింటు వద్ద నుండి, ఖాళీ సంతకములు చేసిన ICICI బ్యాంకుకు చెందిన 14 చెక్కు పుస్తకములు, HDFC బ్యాంకుకు చెందిన 3 చెక్కు పుస్తకములు మరియు 15 ఖాళీ సంతకములు చేసిన ప్రోనోట్లు తీసుకునియున్నారు.

వారి సౌజన్యమునకు, నా ద్వారా అనేక మంది పేద, మరియు కష్టజీవులు దేవునిపై భారం వేసి, నావద్ద నుండి అవసరాలు తీర్చుకుని పద్ధతి ప్రకారం వడ్డీ నా ద్వారా చెల్లించేవారు. జూలై 2024 సం॥లు నా క్లయింటు టయోటా ఇన్నోవా కారు, ఖరీదు చేయగా, సదరు రాజేష్ గారు ఆకర్షితులై దానిని 23 లక్షలకు ఇచ్చివేయమని, నాకు ఇచ్చిన అసలు ధనములో తగ్గించుకోమని చెప్పగా, వారికి ఇచ్చివేసినారు. అప్పటికి అసలు బాకీ 17,20,000/- మాత్రమే - నా క్లయింటు దానిని కూడా దఫదఫాలుగా పూర్తిగా నా క్లయింటు తీర్చివేసినారు. అందువలననే 25-4-2023న ఆయన మరియొక 5 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయగా, వానిని వడ్డీతో సహా 15-6-23 న నా క్లైయింట చెల్లించినారు. రాజేష్ గారు, 9 లక్షలు ట్రాన్సుఫరు చేయగా, దానికి అక్టోబరు 2023 లో ప్రత్యేక వడ్డీ డిమాండు చేయగా, నెలకు 27,000/- చొప్పున వారి ఆదేశమలపై శ్రీ అయిన శ్రీ ఉంగరాల రామకృష్ణ గార్కి బ్యాంకు ద్వారా అక్టోబరు 2024 వర్కు వడ్డీని మా క్లయింటు ట్రాన్సుఫెర్ చేసినారు. ఆవిధంగా మా క్లయింటు ద్వారా వారికి రావలసిన సొమ్ము 9,00,000/- మాత్రమే.

ఈలోగా కొన్ని అరాచక శక్తులు, సదరు రాజేష్ గారికి మనస్సును విషపూరితం చేసి, తక్షణమే పై 9 లక్షల నవంబరు 2024 నుండి వడ్డేతో తీర్చివేయమని డిమాండు చేసినారు . అయితే నా క్లయింటు ధర్మముగా, తనవద్ద తీసుకున్న పై నుదహరించిన ఖాళీ సంతకములు తీసుకున్న డాక్కుమెంట్లు తిరిగి ఇమ్మని కోరినారు. రాజేష్ గారు, వారి సతీమణి గారు, అలాగే అని ఒప్పుకొని, కొంతకాలం తరువాత ఇటీవల ఒక కోటి ఇర వై లక్షలు ఇవ్వమని డిమాండు చేసి, లేకపోతే, నాక్లెయింటు డాక్కుమెంట్లు ను దుర్వని యోగం చేస్తామని బెదిరించినారు. నా క్లెయింటు సత్వరము పోలీసువార్ని ఆశ్రయించి విషయము తెల్పియున్నారు. బ్యాంకువారి తెలియపర్చినారు . మరియు శ్రీ రాజేష్ గారు, వారి సతీమణి వార్కి కూడా, తన కాగితములు దుర్వినియోగం చేయరాదనిన్నీ, బ్యాంకులో చెల్లింపు ఆపి వేసినామని కూడా తెలియపర్చినారు.

కావున యావన్మంది గ్రహించవలసినది ఏమనగా నా క్లయింటు చెక్కులు, ప్రోనోట్లు 2018వ సం॥లు సంతకములు చేసినవి. అవి చట్టప్రకారము చెల్లవు. కాని ఎవరైనా ప్రలోభపడి, సదరు రాజేష్ గారి ద్వారా గాని, మరే విధంగానై నా వాటిని ఉపయోగించినచో వారుశిక్షార్హులగుదురు.

నా క్లయింటు గారు, వారు న్యాయముగా ఇవ్వవలసినది మైనా ఉంటే, వాటిని లోగడ తీర్చివేసినట్లుగానే, వారి ద్వారా రావలసినవి వచ్చిన వెంటనే, వడ్డీతో సహా చెల్లింపచేసి, శ్రీ రాజేష్ గారి ఆత్మకు శాంతి కల్గిస్తానని హామీ ఇచ్చినారు. అయినప్పటికిన్నీ, ఈ సమాజంలో యున్న "అసాంఘిక, అరాచక శక్తులకు లోబడి శ్రీ రాజేష్ గారుగాని, వారి సతీమణి గాని మరియు ఏఒక్క అమాయకులైనను నా క్లయింటుపై ఏ విధమైన, అసత్య ప్రచారములు గాని, అసత్య దావాలు, క్రిమినల్ కేసులు గాని మరియు ప్రత్యేకముగా చెక్కు బౌన్సు కేసులు గాని వేసినచో అవి చెల్లనేరవనిన్నీ, ప్రజలు మోసపోవద్దనిన్నీ లోకశాంతి కొరకు మీకు మా క్లయింటు తెలియజేయుచున్నారు.

<u>*చెక్కుల వివరములు:*</u>

ICICI Bank No. 003841 to 003850, 003851 to 003860, 003881 to 003890, 003831 to 003840, 018716 to 018725, 013351 to 013365, 018861 to 018890, 013786 to 013815, 22661 to 22670, 29376 to 29380. 11901 to 11905, 3826 to 3830, 3841 to 3850,
HDFC Bank No. 000001 to 000005, 000006 to 000030, 000031 to 000055.

రాజమండ్రి **జి.యు.వి.బి.రాజు,** అడ్వకేట్
24-05-25 వీవర్స్ కాలనీ, రాజమండ్రి, సెల్: 9848370855

ప్రకటన

మా క్లయింటు కాకినాడ జిల్లా, కాకినాడ కాపురస్తులు **కొల్లు వీర వెంకట సత్యన్నారాయణ గారి కుమారుడు కొల్లు బయ్యేశ్వరరావు గారు** కాకినాడ పట్టణంలో ఈ దిగువ సంతకాలు చేసిన ఖాళీ చెక్కులు, ప్రామిశరీ నోట్లు, వైట్ పేపర్పు గల హ్యాండ్ బ్యాగ్ పడిపోయినది.

1. State Bank of India, Gorlapalem Branch, A/c. No. 11577307693, చెక్ నెం. 829462, 829463, 829464, 829465, 829466, 829467, 829468, 829469, 829470, 829471, 829472, 829473, 829474, 829475, 829476 (15 చెక్స్).
2. కరూర్ వైశ్యాబ్యాంక్, ఆర్యవటం బ్రాంచ్, A/c. No. 4858155000000633, చెక్ నెంబర్లు 000208, 000209, 000210, 000211, 000212 = 5 చెక్స్.
3. ఆంధ్రా బ్యాంక్, కాజులూరు బ్రాంచ్ A/c. No. 140210100000229 చెక్ నెంబర్స్ 1. 000027, 2. 000028, 3. 000029, 4. 000030, 5. 000031.
4. ప్రామిశరీ నోట్లు 15, ఖాళీ పేపర్లు 6.

సదరు సంతకాలు చేసిన ఖాళీ చెక్స్, ప్రామిశరీ నోట్లు, వైట్ *(Conqure)* పేపర్లు ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు అందజేయగలరని, ఒకవేల ఎవరైనా *MISUSE* చేసిన అవి చెల్లనేరవని ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడమైనది.

ఎస్.వి.రాఘవరెడ్డి
అడ్వకేట్, వెంకటేశ్వరనగర్
రాజమహేంద్రవరం రాజమహేంద్రవరం
ది.24-5-2025 సెల్: 9346322113

మహారాజశ్రీ 6వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : కాకినాడ

I.A.No.250/2022, O.S.No.478/2022

Between:
మాగపు కిరణ్ కుమార్
...పిటీషనర్ / ప్లెయింటిఫ్
మరియు
మోర్తా సుబ్రమణ్యం & వగైరాలు
...రెస్పాండెంట్లు / ప్రతివాదులు

R_1 : మోర్తా సుబ్రమణ్యం, S/o. (లేటు) సత్తిరాజు, డో.నెం. 1-1A-24, మహాత్మా వీధి, కొండయ్యపాలెం, కాకినాడ.
R_2 : మోర్తా రామచంద్రరావు, S/o. (లేటు) సత్తిరాజు, డో.నెం. 70-3-8/2, విద్యా నగర్, రమణయ్యపేట, కాకినాడ.
R_3 : మోర్తా మణి, W/o. (లేటు) అచ్యుతరామయ్య, గృహిణి, డో.నెం. 5-7, వేములవాడ గ్రామం, కరప మండలం.
R_4 : మోర్తా మంజు, S/o.(లేటు)అచ్యుతరామయ్య, స్టూడెంట్, డో.నెం. 5-7, వేములవాడ గ్రామం, కరప మండలం.
R_5 : మోర్తా రాము, S/o. (లేటు) అచ్యుతరామయ్య, స్టూడెంట్, డో.నెం. 5-7, వేములవాడ గ్రామం, కరప మండలం.
R_6 : పోతురాజు జయలక్ష్మీ, W/o. రామచంద్రరావు, డో.నెం. 1-1A-20/2, మహాత్మా వీధి, కొండయ్యపాలెం, కాకినాడ.
R_7 : నామల జయలక్ష్మీ, W/o. మధుసూదనరావు, డో.నెం. 1-1A-20, మహాత్మా వీధి, కొండయ్యపాలెం, కాకినాడ.
R_8 : కొల్లపు రామలక్ష్మీ, W/o. శ్రీనివాసరావు, డో.నెం. 3-50, కాపవరం గ్రామం, రామచంద్రపురం మండలము.
R_9 : కొప్పుల సుబ్బలక్ష్మీ, W/o. రాము, డో.నెం. 1-12-21/A, మహాత్మా వీధి, కొండయ్యపాలెం, కాకినాడ.
R_{10} : శ్రీమతి కొండెపూడి స్వాతి, W/o. వీర్రాజు, డో.నెం. 1-12-21/A, మహాత్మా వీధి, కొండయ్యపాలెం, కాకినాడ.
R_{11} : కొయ్య బాబూరావు, S/o. పంపులు, డో.నెం. 1-12-58/2, వీరమళ్ళ వారి వీధి, మిలటరీ రోడ్, భానుగుడి, కాకినాడ.

పై నెంబరు పిటీషన్ I.A. No. 250/2024 లో 4,5 రెస్పాండెంట్లు మైనర్లు అయినందున 3వ రెస్పాండెంట్ ని గార్డియన్ గా అపాయింట్ చేయమని పిటీషన్‌లో మీరు రెస్పాండెంట్లు అయ్యివున్నారు. మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పై నెంబర్ పిటీషన్ **ది.16-06-2025 నం॥ తేదిన** వాయిదా అయ్యివున్నది. కావున మీరు పై తేదిన పైన తెలిపిన కోర్టులో **ఉదయం గం.10.30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పై పిటీషన్ తమ పరోక్షమున తీర్మానము చేయబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081